క్లుప్తంగా

రోడ్డు భద్రతను బాధ్యతగా భావించాలి

కైలాస్‌నగర్(జైనథ్): రోడ్డు భద్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని జైనథ్ ఎస్సై పురుషోత్తం అన్నారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జైనథ్ మండలంలోని లక్ష్మింపూర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బైక్ నడిపే టప్పుడు హెల్మెట్‌ను విధిగా ధరించాలిని, మద్యం తాగి వాహనాలను నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'సభను విజయవంతం చేయండి'

ఆదిలాబాద్‌రూరల్: ఫిబ్రవరి 2న హలో బీసీ.. చలో వరంగల్ బీసీ బహిరంగా సభను విజయవంతం చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 2న వరంగల్‌లో బీసీ కులాల వారి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా బీసీ కులాల వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో ప్రస్తుతం 42 శాతం రిజర్వేషన్లు సాధించాలన్నారు. సమావేశంలో నాయకులు రఘు, సత్యనారాయణ, ఊశన్న, మల్లయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింహులు, శంకర్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎన్జీవోల ఆధ్వర్యంలో హెల్ప్ డెస్కు

కైలాస్‌నగర్: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. 13 వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త సహకారంతో రిమ్స్ ఓపీ విభాగంలో రోగుల సహాయార్థం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కును సోమవారం ఆయన ప్రారంభించారు. హెల్ప్‌డెస్కులో ఎన్జీవోల వలంటీర్లతో పాటు రిమ్స్ సిబ్బంది ఉంటారని, ఓపీతో పాటు వార్డులకు వెళ్లేందుకు రోగులు, వారి కుటుంబీకులకు అవసరమైన సహాయాన్ని అందిస్తారన్నారు. రక్తదానంతో రిమ్స్ బ్లడ్‌బ్యాంకు మొదటి స్థానంలో నిలిచి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వయో వృద్ధుల సమాఖ్య ప్యాకెట్ క్యాలెండర్ ఆవిష్కరించారు.

మండల అభివృద్ధికి కృషి

నేరడిగొండ: మండల కేంద్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.25 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, ఏలేటి రాజు రెడ్డి, జనార్దన్, మధుకర్, నాయిడి రవి, షేక్ వకీల్, ఆత్రం నగేశ్, సయ్యద్ అన్వర్, ఇసాఖ్, మనోజ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి

నార్నూర్: నిర్లక్ష్యం వీడండి.. క్షేత్రస్థాయి అంకితభావంతోని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నార్నూర్, గాదిగూడ, ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు ఏఎన్ఎంలు, హెచ్ఏలు, హెల్త్ సూపర్‌వైజర్‌లతో మాతా శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణులు, మహిళల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది ఏఎన్ఎంలు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ నెలా ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి సాధన, పీహెచ్‌సీ వైద్యులు జీతేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సంజీవ్ రాథోడ్ ఉన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ జాతీయ రహదారి సమీపంలో సోమవారం లారీ బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు కాటన్ లోడ్‌తో వెళ్తున్న లారీ లఖంపూర్ జాతీయ రహదారి సమీపంలో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. అందులోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిని జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదారాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ వరకు అప్‌డేట్ చేయాలని కోరారు.

శరవేగంగా గోదాంల నిర్మాణం



అర్లి(టి)లో కొనసాగుతున్న గోదాం నిర్మాణ పనులు

- కొనసాగుతున్న మూడు గోదాంల నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తాంసి: రైతుల పంటల సాగుకు అవసరమయ్యే వివిధ ఎరువుల కోసం తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల రైతులు తాంసి మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. సీజన్‌లో ఎరువుల కోసం రైతులు మండల కేంద్రంలోని సహకార సంఘానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎరువులను ఆయా గ్రామాల రైతులకు అందుబాటులో ఉంచేందుకు తాంసి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాంల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తాంసి, భీంపూర్ మండలాల్లోని రైతులకు సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు అందుబాటులో ఉండే విధంగా గిరిగాం, అర్లి(టి), కరంజి(టి) గ్రామాల్లో ఎరువుల గోదాంల నిర్మాణానికి సొసైటీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి సహకారంతో అనువైన స్థలాలను గుర్తించారు. గోదాంల నిర్మాణానికి నిధులు సైతం సొసైటీతో పాటు బ్యాంక్ సహకారంతో సమకూర్చి, అన్ని అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించారు. గోదాంల పనులు శరవేగంగా కొనసాగుతుండడంతో వచ్చే సీజన్ నుంచి వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉంటాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గనున్న దూర భారం..

తాంసి, భీంపూర్ మండలాల్లో దాదాపుగా 40 వేల ఎకరాలకు పైగా సాగుభూమిలో పత్తి, సోయా, కంది, శనగ, జొన్నతో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగు చేసే సమయంలో యూరియా, డీఏపీ ఇతర ఎరువుల కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎరువుల కొనుగోలు ఆయా గ్రామాల నుంచి రైతులు తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘానికి వచ్చి తీసుకెళ్లాలి. దీంతో రైతులకు దూరభారం కావడంతో పాటు రవాణా ఖర్చులు సైతం అధికమై ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను రైతులు సొసైటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి అందుబాటులో గోదాంల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. దీంతో తాంసి సొసైటీ నుంచి రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా మూడు చోట్ల గోదాంల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. నిర్మాణ పనులు సైతం వేగంగా సాగుతున్నాయి.

రూ.84 లక్షలతో..

కరంజి(టి), అర్లి, గిరిగాం గ్రామంలో రూ.84 లక్షలతో గోదాంలను నిర్మిస్తున్నారు. గిరిగాం గ్రామంలో 150 మెట్రిక్ టన్నుల గోదాంను రూ.26 లక్షల సొసైటీ నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. అర్లి(టి)లో 300 మెట్రిక్ టన్నుల గోదాంను రూ.30 లక్షలతో, కరంజి(టి)లో 250 మెట్రిక్ టన్నుల గోదాంను రూ.28 లక్షల డీసీసీబీ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకొని పనులు పనులు చేపడుతున్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచేందుకు

తాంసి ప్రాథమిక సహకార పరిధిలో ఉన్న రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని గోదాంల నిర్మాణం చేపడుతున్నాం. ప్రస్తుతం తాంసిలో కేంద్రానికి రావాలంటే రైతులకు ఇబ్బంది పడుతున్నారు. సొసైటీ చైర్మన్‌తో పాటు పాలకవర్గం గోదాంల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. ఆయా గ్రామాలలో గోదాం నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి గోదాంల నిర్మాణానికి అనువుగా ఉన్న గ్రామాలను ఎంపిక చేశాం. వచ్చే సీజన్ నుంచి ఎరువులను గోదాంలలో అందుబాటులో ఉంచి రైతులకు విక్రయిస్తాం.

– కేశవ్, ప్రాథమిక సహకారం సంఘం సీఈవో తాంసి

సంస్కృతి, సంప్రదాయాలను మరవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సిరికొండ: తరాలు మారుతున్నా.. మన సంస్కృతి, సంప్రదాయాలను నేటితరం యువత మరువద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని వాయిపెట్ గ్రామంలోని శివాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు తిలకించి సరదగా ఆట ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో రూ.15 కోట్లతో రోడ్లు వేశామన్నారు. అసెంబ్లీలో వాయిపెట్, అల్లంపెల్లి గ్రామాల అభివృద్ధికి గళం విప్పామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆలయ పూజారి శంభు, ఇంద్రవెల్లి మార్కెట్ చైర్మన్ ముఖాడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. నేరడిగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం గుత్పాల గ్రామంలోని మినీ గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎల్టీ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్రీయ బాల స్వస్థత వైద్య బృందం సభ్యులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి కృష్ణవేణి కంటి పరీక్ష, రక్తపరీక్షతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దినేష్, ఫార్మసిస్ట్ కిశోర్, ఏఎన్ఎం ఆయిషా సిద్ధిఖీ, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, సంతోశ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న సభ్యులు

నార్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ వర్క్స్ బోర్డ్ మెంబర్ యూనిస్ అక్బాని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తొడసం వంశీయుల ఆరాధ్య దైవం ఖందేవ్ జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖందేవ్ ఆలయానికి 110 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. దాదాపు నాలుగైదు రాష్ట్రాల నుంచి తొడసం వంశీయులు ఈ మహాపూజలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వాలీబాల్‌లో మొదటి బహుమతిగా మాన్కాపూర్ జట్టు రూ. 7వేలు, ద్వితీయ బహుమతిగా ఏంపల్లి రూ. 5వేలు, కబడ్డీ టోర్నమెంట్‌లు మొదటి బహుమతిగా లోకారి(కె) రూ. 11వేలు, ద్వితీయ బహుమతిగా భేతాల్ గూడకు రూ. 7 వేలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్, ఊర్వేత రూప్ దేవ్, ఆడే సురేశ్ పాల్గొన్నారు.

ప్రవచనలు ఆచరణలో పెట్టాలి

బజార్‌హత్నూర్: శ్రీశ్రీ సంత్ సద్గురు పూలాజీ బాబా ప్రవచనలను ఆయన భక్తులు ఆచరణలో పెట్టాలని, సామాజిక సేవ, శాంతియుత జీవనం అలవర్చుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో మనసు ప్రశాంతత ఉంటుందని ఆధ్యాత్మికవేత్త కేశవ్ ఇంగ్లీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన మందిరం 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం నిర్వహించి, అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావ్, మాజీ జెడ్పీటీసీ కొత్త శంకర్, మాజీ ఎంపీటీసీ జల్కే పాండురంగ్, చిల్కూరి భూమన్న, చట్ల ఉత్తం, లక్కం శంకర్, నందినర్సయ్య, కోండిబా, జ్ఞానోబా, శివుడు, గజ్జయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త కేశవ్ ఇంగ్లీ

సమస్యల పరిష్కారానికి పోరాటం


ఎదులాపురం: సమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సంగారెడ్డిలో జరుగుతున్న పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో సోమవారం జిల్లా రిపోర్టును ప్రవేశపెట్టారు. గత మూడేళ్ల కాలంలో జిల్లాలో చేపట్టిన ప్రజాపోరాటాలను వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లా అభివృద్ధిపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. సిమెంట్ కార్పొరేషన్‌ను తెరిపించడంలో, ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు, విమానాశ్రయం నిర్మాణం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపీ మతోన్మాద రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా నిత్యం పోరాడుతున్న తీరును వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం భవిష్యత్‌లో పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు లంకా రాఘవులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దర్శనాల మల్లేష్

చైల్డ్ హెల్ప్‌లైన్ సద్వినియోగం చేసుకోవాలి

కైలాస్‌నగర్: ఆపత్కాలంలోని పిల్లలకు తక్షణ సాయం అందించే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ యశోద అన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని తాటిగూడ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కేంద్రం ద్వారా అందించే సేవలపై విద్యార్థులకు వివరించారు. 24గంటల పాటు అందుబాటులో ఉండి సేవలందిస్తుందన్నారు. పిల్లల సంరక్షణ, రక్షణ, పునరావాసం వంటి అంశాల్లో సాయమందిస్తుందన్నారు. ఫిర్యాదు చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణ, సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో వసంత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీవో స్వప్నశీల

తలమడుగు: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మేఘమాల, వ్యవసాధికారి ప్రమోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాపాలనలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజాపాలన సేవ కేంద్రం ద్వారా పలు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావులు తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, పేర్లు యాడ్ చేయడం వంటి గురించి దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి ఏర్పాటు చేసినట్లు ఎంపీవో సాయి ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించడం జరుగుతుందన్నారు.

తాంసి: మండల కేంద్రంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ప్రజావాణి సమాచార, సహాయ కేంద్రాన్ని సిబ్బందితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంట సిబ్బంది సతీష్, వినోద్, గంగన్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ఆదిలాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి ఎంపీవో స్వప్నశీల దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజు 6 దరఖాస్తులు రాగా అందులో ముగ్గురు రేషన్ కార్డు మంజూరు చేయాలని, ఇద్దరు ఆత్మీయ భరోసా, మరొకరూ గృహ జ్యోతి పథకానికి దరఖాస్తులు చేసుకోవడం జరిగిందన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న మెడికల్ ఆఫీసర్, సిబ్బంది

నేరడిగొండ: గణతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ హెచ్‌ఈవోగా అవార్డు అందుకున్న నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి ఎండీ సద్దాం, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ బాపూజీ, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఎల్టీ ఉత్తమ్ సింగ్ పాల్గొన్నారు.

అధికారుల కేటాయింపు

బోథ్: బోథ్ మండలం నుంచి నూతనంగా సొనాల మండలంగా ఏర్పడగా, అధికారులు సొనాల మండలానికి అధికారులను కేటాయించారు. బోథ్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్‌ను సొనాల మండల ఎంపీడీవోగా నియమించారు. కాగా గ్రామంలోని పాత జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల భవనంలో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముగ్గురు కార్యాలయ సిబ్బందిని నియమిస్తున్నట్లు జిల్లా జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

'నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత'

ఉట్నూర్‌రూరల్: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో , అధికారులతో సమావేశం నిర్వహించారు. దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేసిందని అర్హులైన వారికి వంద శాతం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

క్రీడల్లో అంతర్జాతీయస్థాయిలో రాణించాలి

నేరడిగొండ: క్రీడల్లో మెలకువలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శోభన్‌బాబు, తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్, మెదక్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల మైదానంలో మహిళ, పురుషుల సాఫ్ట్‌బాల్ సీనియర్ క్రీడాకారుల శిక్షణ శిబిరానికి సోమవారం వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మ్యాచ్ బాల్స్ అందజేశారు. క్రీడల్లో రాణిస్తూ జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్, నిర్వాహక కార్యదర్శి, పీడీ అఖిల్, అసోసియేషన్ సభ్యులు రాధేశ్యామ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బాల్స్ అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నేరడిగొండ: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నేరడిగొండ పీఆర్టీయూ టీఎస్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నాయకులు కటుకూరి గంగాధర్, శ్రీనివాస్ గౌడ్, మల్లీశ్వరి, వెంకటరమణ, శారద, జాదవ్ ఆనంద్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా యూపీఎస్ స్కీంను ప్రవేశపెట్టిందని ఈ స్కీంలో తెలంగాణ ప్రభుత్వం చేరవద్దని కోరుతు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం పీఆర్టీయూ సంఘం నాయకులు తహశీల్దార్ సత్యనారాయణకు అందచేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన యూపీఎస్ స్కీం ద్వారా ఉద్యోగులు త్రీవంగా నష్టపోనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు బాలచంద్ర తాత్రె, అవులు మహేందర్, రమేశ్, రాథోడ్ సంతోష్‌కుమార్, మెస్రం నాగేశ్వర్‌రావు, కాశినాథ్, జాడె దీపక్, కంఠేశ్వర్, కాంతయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు